సాక్షి
చిత్తూరు
గురువారం ∙ 6 ∙ జూన్ ∙ 2024



చంద్రగిరిలో కత్తులతో దాడి

చంద్రగిరిలో టీడీపీ నాయకులు మరోసారి పేట్రేగిపోయారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌పై హత్యాయత్నం చేశారు. - 8లో



వైఎస్సార్‌సీపీ కార్యాలయం ధ్వంసం

తిరుపతి నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై టీడీపీ మూకలు దాడి చేసి ధ్వంసం చేశాయి. - 8లో



మొక్కలే జీవనాధారం

మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని, అందరూ మొక్కలు విరివిగా పెంచాలని ఎస్వీ జూపార్కు క్యూరేటర్ సెల్వం అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

'గురుకుల' బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు

సదుం: జిల్లాలోని సదుం, పులిచెర్ల, పెద్దపంజాణి, కుప్పంలోని ఎంజేపీ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కన్వీనర్ ప్రిన్సిపల్ శ్రీనివాసుల రెడ్డి బుధవారం తెలిపారు. 6, 7, 8, 9 తరగతులకు సంబంధించి ఖాళీల భర్తీకి ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. https://mjpapbcwries.apcfss.in/ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈనెల 20న నిర్వహించనున్నట్టు చెప్పారు. పూర్తి వివరాలకు సంబంధిత పాఠశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ ఫలితాలు విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని డీఈఓ దేవరాజు వెల్లడించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పరీక్షలు రాసిన విద్యార్థులు ఫలితాలను డీఈఈ. ఏపీ. జీవో. జీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు త్వరలో మెరిట్ కార్డులు పంపనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు వెంటనే ఏదైనా జాతీయ బ్యాంకులో విద్యార్థి పేరుతో సేవింగ్స్ బ్యాంకు ఖాతా తెరవాలన్నారు. విద్యార్థి ఆధార్ నంబర్‌ను మాత్రమే అకౌంట్ నంబర్‌కు లింక్ చేయాలని చెప్పారు. ఎంపికైన విద్యార్థుల కోసం త్వరలో జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ www.scholarships.gov.in ను తెరుస్తుందని తెలిపారు. ఆ తర్వాత ఎంపికైన ప్రతి విద్యార్థి నమోదు చేసుకునేందుకు విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, మెరిట్ లిస్టు మెరిట్ కార్డులో ఉన్న విధంగానే ఆధార్ కార్డులోనూ, బ్యాంకు పాస్ పుస్తకంలోనూ తప్పులు లేకుండా చూసుకోవాలని డీఈఓ తెలిపారు.

బీసీజీ టీకా లక్ష్యాన్ని పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి

చిత్తూరు రూరల్(కాజీపాకం): బీసీజీ టీకా లక్ష్యాన్ని పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం అడల్ట్ బీసీజీ టీకా కార్యక్రమంపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బీసీజీ వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయాలన్నారు. ఆగస్టు నాటికి లక్ష్యాన్ని అధిగమించాలని కోరారు. సీహెచ్ సేవలను మెరుగుపరచాలని చెప్పారు. గర్భిణీ సేవల్లో లోటు లేకుండా చూసుకోవాలన్నారు. సుఖ ప్రసవాల సంఖ్యను పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకుల అడ్మిషన్లకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి సమీపంలోని మురకంబట్టు వద్ద ఉన్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో అడ్మిషన్లకు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ భార్గవి తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో మైనారిటీ బాలికలు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఒకే ఒక్కడు



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

జిల్లా రాజకీయాలను శాసిస్తూ పెద్దాయనగా పేరొందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పటివరకు ఆయన మొత్తం ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. టీడీపీ కంచుకోటగా పేరొందిన పుంగనూరు నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు విజేతగా నిలిచారు. అంతకుముందు రెండు సార్లు పీలేరు నుంచి గెలుపొందారు. తండ్రీ తనయులైన వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంత్రి వర్గాల్లో పలు శాఖలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ సారి టీడీపీ సునామీలోనూ తట్టుకుని జిల్లాలో విజయం సాధించిన ఏకైక ఎమ్మెల్యేగా పేరుపొందారు.



ఎస్వీ సెట్‌లో సాగుతున్న ఈవీఎం ఓట్ల లెక్కింపు(ఫైల్)

- ఉత్కంఠగా సాగిన ఫలితాల కౌంటింగ్
- ఓట్ల లెక్కింపు ఆఖరున కావాలనే నెపం
- ఎన్ని కుట్రలు చేసినా ఫలితం లేదని తెలిసి చేతులెత్తేసిన కూటమి
- వరుసగా ఆరోసారి ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈ నెల 4వ తేదీన ఉత్కంఠగా సాగింది. మొదటి రౌండ్ నుంచి 19వ రౌండ్ వరకు గెలుపు ఎవరికీ తేలని పరిస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మెజారిటీ పెరుగుతూ వచ్చేసరికి చివరి రెండు రౌండ్ల ఓట్ల లెక్కింపు గంటకు పైగా ఆపేశారు. ఓటమి ఖాయం అనుకున్న కూటమి అభ్యర్థి ఆర్‌ఓకు ఆధారం లేని ఫిర్యాదులు చేశారు. ఎలాగైనా రీ కౌంటింగ్ చేయించాలని పట్టుబట్టారు. అయితే సరైన ఆధారాలు లేకపోవడంతో రీ కౌంటింగ్ చేయడం కుదరదని అధికారులు తేల్చిచెప్పేశారు. దీంతో పుంగనూరు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ముగించి విజేతను ప్రకటించారు.

పుంగనూరు నుంచి నాలుగోసారి

రాజకీయాల్లో డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక స్థానం ఉంది. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజానాయకుడిగా పేరు తెచ్చుకున్న పెద్దాయన వరుసగా నాలుగో సారి పుంగనూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. పుంగనూరు రికార్డును బద్దలు కొట్టారు. రైతు కుటుంబం నుంచి రాజకీయ చదరంగంలో ఆయన రారాజుగా ఎదిగారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న పుంగనూరుకు 2004లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. 2009లో కాంగ్రెస్ పార్టీ తరపున, 2014, 2019, 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున బరిలో దిగి ఎమ్మెల్యేగా వరుసగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 2009 ఎన్నికల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా, 2019లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు.

సమాచారం	
పుంగనూరు నియోజకవర్గం	
మొత్తం ఓట్లు	2,09,674
ఈవీఎంలలో పోలైన ఓట్లు	2,06,911
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	2,763
పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వచ్చిన ఓట్లు	1,00,793

సంజీవరెడ్డి పరిచయమే

1977లో రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయాలను గమనించిన రామచంద్రారెడ్డి ఒక సారి నీలం సంజీవ రెడ్డిని కలుసుకున్నారు. ఆయన ప్రోత్సాహంతో 1978లో జనతా పార్టీ పీలేరు అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిని చవిచూశారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరిన పెద్దిరెడ్డి 1989లో మొదటి సారిగా పీలేరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 24,636 ఓట్ల మెజారిటీతో చల్లా రామచంద్రారెడ్డిపై విజయం సాధించారు. 1994లో పీలేరు అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. మళ్లీ 1999, 2004 ఎన్నికల్లో పీలేరు ఎమ్మెల్యేగా వరుసగా విజయం సాధిస్తూ వచ్చారు. ఆ తరువాత 2009, 2014, 2019లో పుంగనూరు ఎమ్మెల్యేగా వరుస విజయాలతో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. తాజా ఎన్నికల్లో 6095 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

పెద్దిరెడ్డికి 1,00,793 ఓట్లు

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 8 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నియోజకవర్గం మొత్తం 2,09,674 ఓట్లు పోల్ అవ్వగా ఈవీఎంలో 2,06,911 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్‌లో 2,763 ఓట్లు ఎన్నికల్లో పోలయ్యాయి. ఇందులోనే నోటాకు 2,904 మంది ఓట్లు వేశారు. ఆఖరి రౌండ్ ముగిసే సరికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి 1,00,793 ఓట్లు, ప్రత్యర్థికి 94,698 ఓట్లు నమోదయ్యాయి. దీంతో 6,095 మెజారిటీ రావడంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైనట్లు ఆర్‌ఓ ప్రకటించారు. ఆ నియోజకవర్గంలో పోటీ చేసిన ప్రత్యర్థి పార్టీకి చెందిన చల్లా రామచంద్రారెడ్డికి 94,698, భారత చైతన్య యువజన పార్టీకి చెందిన బోడె రామచంద్ర యాదవ్‌కు 4559, కాంగ్రెస్‌కు చెందిన మురళిమోహన్ యాదవ్‌కు 3571, బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన సురేష్‌కు 687, సోషల్ డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి అన్వర్ బాషా కు 1906, ఇండెపెండెంట్లుగా పోటీ చేసిన నాగేశ్వరరావుకు 242, రామయ్యకు 314 ఓట్లు నమోదయ్యాయి.

పెద్దాయనకు మంచిపేరే..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బలమైన నాయకుడిగా ఎదిగిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక, ప్రజలతో మమేకం అవుతూ రాష్ట్రంలోనూ, ముఖ్యంగా రాయలసీమలో తిరుగులేని నాయకుడిగా పేరుతెచ్చుకున్నారు. ఎస్వీ యూనివర్సిటీ రాజకీయాల్లో చంద్రబాబుకు సమఉజ్జీగా నిలిచారు. నాటి నుంచి నేటి వరకు చంద్రబాబుతో తలపడుతూనే వస్తున్నారు. పల్లెల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా సరే పెద్దాయన తలుపు తడితే చాలు కష్టం తీరిపోతుందని నమ్మేంతగా ప్రజాదరణను చూరగొన్నారు. అందుకే కూటమి నేతలంతా గెలుపొందినా పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బలం ముందు చంద్రబాబు ఎత్తులు, పైఎత్తులు చిత్తయ్యాయి.

తాత్కాలికంగా పాస్‌ల జారీ నిలిపివేత

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ వద్ద రోజు అందిస్తున్న పలు ఆర్టీసీ బస్సు పాస్‌లను రెండు రోజులపాటు(6, 7)తేదీల్లో నిలుపుదల చేస్తున్నట్లు తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ చేస్తున్నందున తాత్కాలికంగా ఆపినట్లు చెప్పారు. ఈ విషయాన్ని విద్యార్థులతో పాటు అన్ని వర్గాలకు చెందిన వారు గుర్తుంచుకోవాలని సూచించారు. 8వ తేదీ నుంచి యథావిధిగా బస్సు పాస్‌లు అందిస్తామని వివరించారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. అర్ధరాత్రి వరకు 76,291 మంది స్వామివారిని దర్శించుకోగా 28,495 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటలకు, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జిల్లా వక్ఫ్‌బోర్డు పదవికి సిరాజ్‌బాషా రాజీనామా



సిరాజ్‌బాషా

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవికి షేక్ సిరాజ్‌బాషా బుధవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఓటమి తనను ఎంతగానో బాధించిందని తెలిపారు. తన పదవీ కాలంలో సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారికి పంపారు.

టీడీపీ శ్రేణుల వీరంగం



టీడీపీ నేతలు ధ్వంసం చేసిన బైరెడ్డిపల్లె చంద్రశేఖర్ ఇంటి వరండా రేకులు



పాతపేటలో టీడీపీ నేతలు టపాసులు పేల్చడంతో గాయపడిన చిన్నారి



చిన్నారి చేయిపై కాలిన బొబ్బలు

- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దౌర్జన్యం

బైరెడ్డిపల్లె: సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత మండలంలోని వివిధ గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ బైక్‌లపై వీర విహారం చేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, కార్యకర్తలపై దాడులకు దిగారు. టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారనే విషయం తెలియగానే ఎన్నికల నియమాలకు విరుద్ధంగా టపాకాయలు పేల్చుతూ ర్యాలీలు నిర్వహించారు. బైరెడ్డిపల్లె వార్డు సభ్యులు చంద్రశేఖర్ ఇంటి ముందు వరండాకు ఉన్న రేకులను ధ్వంసం చేశారు. అలాగే శెట్టిపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్తలు గడ్డిండ్లు గ్రామానికి వెళ్లి వీరంగం చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన రామక్రిష్ణప్ప, లక్ష్మీపతి, సాలమ్మ ఇళ్లలోకి చొరబడి చితకబాదారు. పాతపేట సర్పంచ్ రవి కుటుంబ సభ్యులపై దాడులు చేసి ఓ చిన్నారిపై టపాసులు వేయడంతో చేతికి తీవ్రగాయాలయ్యాయి. వెంగంవారిపల్లెలో ఎస్సీ కుటుంబీకులు రాజేశ్వరమ్మ, భాస్కర్, మురగేష్‌పై దాడులు చేశారు. మండలంలోని కంభంపల్లె సచివాలయంలోకి టీడీపీ నేతలు చొరబడి అభివృద్ధి సంక్షేమ పథకాల కరపత్రాలను కాల్చివేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు.



కంభంపల్లె సచివాలయంలో సంక్షేమ పథకాల కరపత్రాలను తగలబెడుతున్న టీడీపీ నేతలు

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



శ్రీసిటీలో మొక్కలు నాటుతున్న ఫారెస్టు, శ్రీసిటీ అధికారులు

- పరాగ సంపర్కంలో తేనెటీగల పాత్రపై ప్రత్యేక ప్రదర్శన

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా బుధవారం నిర్వహించారు. శ్రీసిటీ ఉద్యానవన విభాగం అధికారి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో అటవీశాఖ రేంజ్ అధికారి జి.జయప్రసాదరావు, చెన్నైకి చెందిన ప్రొఫెసర్ విలియం జేమ్స్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయప్రసాదరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై శ్రీసిటీ పరిశ్రమలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు. పర్యావరణం, పరాగ సంపర్కంలో తేనెటీగల కీలకపాత్ర గురించి ప్రొఫెసర్ విలియం జేమ్స్ వివరించారు. తేనెటీగల నివాసాలను సంరక్షించడం, రసాయనిక వినియోగాన్ని తగ్గించడం, నీటి వనరుల లభ్యత, స్థానిక జీవితాన్ని ప్రోత్సహించడం వంటి పలు పర్యావరణ అనుకూల పద్ధతులను ఆయన సూచించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణలో సవాళ్లు, కచ్చితమైన ప్రణాళిక ఆవశ్యకతపై ప్రస్తావించారు. సీతాకోక చిలుకలు, తేనెటీగలు, ఇతర పక్షులు, కీటకాల సంరక్షణ కోసం శ్రీసిటీలో రెండు ఎకరాల్లో పరాగ సంపర్క ఉద్యానవనం(పాలినేషన్ పార్కు) ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీసిటీ ఉద్యాన విభాగ అధికారి మధుసూదన రెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీలో ఏర్పాటు చేసిన అడవులు తరహా పచ్చదనాన్ని పెంపొందించే ×మియావాకి₹ ప్లాంటేషన్‌పై వివరించారు. ఇందుకోసం 10 ఎకరాల్లో 56కు పైగా జాతులకు చెందిన 50 వేలకు పైగా మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. శ్రీసిటీలో పర్యావరణానికి పెద్దపీట వేస్తూ 10 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా నిరంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హోరాహోరీ

- ఏడు నియోజకవర్గాల్లో కూటమికి వచ్చిన ఓట్లు 7,39,035
- వైఎస్సార్‌సీపీకి వచ్చిన ఓట్లు 5,75,749 ఓట్లు
- సీట్లు తగ్గినా వైఎస్సార్‌సీపీ వెంటే ఓటర్లు
- 2019లో ఒక ఎంపీ, మరో ఏడు అసెంబ్లీ స్థానాలు వైఎస్సార్‌సీపీవే
- రికార్డుస్థాయిలో నోటాకు 25,724



సాక్షి, చిత్తూరు: చిత్తూరు జిల్లాలో శాసన సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అత్యధికంగా ఆరు స్థానాల్లో కూటమి విజయం సాధించింది. పుంగనూరులో వైఎస్సార్‌సీపీ గెలుపొందింది. ఈ నెల 4వ తేదీ నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బరిలో ఉన్న టీడీపీ అభ్యర్థులకు 7,39,035 ఓట్లు నమోదు అవ్వగా, అదే ఏడు నియోజకవర్గాల్లో బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు 5,75,749 ఓట్లు పోల్ అయ్యాయి. ఇతర పార్టీల అభ్యర్థులు, నోటా, స్వతంత్రులకు కలిపి ఏడు నియోజకవర్గాల్లో 59,371 ఓట్లు నమోదయ్యాయి.

13.62 లక్షల మంది ఓటు హక్కు వినియోగం

గత నెల మే 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 13,62,008 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 6,74,454 మంది, మహిళలు 6,87,519 మంది తమ ఓట్లు వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూ ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు వేర్వేరుగా ఒక్కో ఓటు చొప్పున వేశారు.

5,75,749 మంది ఓటర్ల మద్దతు

ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం నిర్వహించారు. ఇందులో వైఎస్సార్‌సీపీకి మొత్తం 5,75,749 ఓట్లు లభించాయి. చిత్తూరు పార్లమెంట్ స్థానానికి మొత్తం 5,57,592 ఓటర్లు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి మద్దతు తెలిపారు. ఇక టీడీపీకి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బరిలో ఉన్న అభ్యర్థులకు 7,39,035 ఓట్లు వచ్చాయి. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల మధ్య వచ్చిన ఫలితాల వ్యత్యాసం 1,81,443 గా ఉంది.

వైఎస్సార్‌సీపీ ఓట్లు

2019లో వైఎస్సార్‌సీపీకి ఏడు అసెంబ్లీ స్థానాల పరిధిలో మొత్తం 6,73,638 ఓట్లు, పార్లమెంట్ స్థానం పరిధిలో మొత్తం 6,81,325 ఓట్లు లభించడంతోపాటు అన్ని స్థానాల్లోనూ విజయం సాధించింది. అయితే, ఈ సారి ఎన్నికల ఫలితాల్లో కేవలం ఒక్క పుంగనూరు అసెంబ్లీ స్థానం మాత్రమే దక్కించుకుంది. సీట్లు తగ్గినా ప్రజల ఓట్లు మాత్రం వైఎస్సార్‌సీపీకి పదిలంగానే ఉండడం విశేషం.

చిత్తూరు పార్లమెంట్ స్థానంలో 5,57,592 మంది మద్దతు

ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో చిత్తూరు పార్లమెంట్ స్థానంలో వైఎస్సార్‌సీపీకి 5,57,592 మంది మద్దతు పలికారు. టీడీపీ అభ్యర్థికి 7,78,071 మంది మద్దతు తెలిపారు. రెండు పార్టీల అభ్యర్థుల మధ్య ప్రస్తుత ఎన్నికల్లో వ్యత్యాసం 2,20,479గా నమోదైంది.

రికార్డు స్థాయిలో నోటాకు 25,724 ఓట్లు

ఈ సారి ఎన్నికల్లో రికార్డు స్థాయిలో నోటాకు ఓట్లు పడ్డాయి. ఓటర్లు పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థుల్లో ఎవరూ అర్హులు కారని భావిస్తే అలాంటి వారు ఎవరి పక్షం వైపు మొగ్గుచూపకుండా తమ ఓటును నోటాకు ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ వెసులుబాటు కల్పించింది. ఇందులో భాగంగా పోలైన ఓట్లను అభ్యర్థులతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా లెక్కిస్తారు.

అసెంబ్లీ స్థానాల్లో పోలైన ఓట్ల వివరాలు

నియోజకవర్గం	టీడీపీకి వచ్చినవి	వైఎస్సార్‌సీపీకి వచ్చినవి	ఇతరులు
కుప్పం	1,21,929	73,923	7,515
పలమనేరు	1,23,232	1,03,110	10,214
పుంగనూరు	94,698	1,00,793	14,183
పూతలపట్టు	1,02,137	86,503	6,378
చిత్తూరు	88,066	73,462	6,261
జీడీ నెల్లూరు	1,01,176	75,165	6,880
నగరి	1,07,797	62,793	7,940
మొత్తం	7,39,035	5,75,749	59,371

చిత్తూరు ఎంపీ పరిధిలో	11,976
నగరి	1,744
పుంగనూరు	2,904
కుప్పం	2115
గంగాధరనెల్లూరు	2125
పూతలపట్టు	1420
చిత్తూరు	1096
పలమనేరు	2344
మొత్తం ఓట్లు	25,724

సప్లిమెంటరీ పరీక్షలకు 196 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏపీ ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 196 మంది గైర్హాజరైనట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. జిల్లాలో బుధవారం జరిగిన పదవ తరగతి పరీక్షకు 186 మంది విద్యార్థులకు గాను 57 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు. ఇంటర్మీడియట్ పరీక్షకు 556 మందికి గాను 139 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెల్లడించారు.

క్లుప్తంగా

పిడుగు పాటుకు యువకుడి మృతి

దొరవారిసత్రం: పశువులు మేపడానికి వెళ్లిన ఓ యువకుడు పిడుగు పాటుకు గురై మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. తొగరాముడి గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన కోట్లపాటి పోలయ్య, గిరిజ దంపతుల కొడుకు చందు 10వ తరగతి చదివి ఇంటి వద్దనే ఉంటూ పశువులను మేపుతున్నాడు. ఈక్రమంలో మంగళవారం పశువులను మేపడానికి గ్రామ సమీపంలోని పంట పొలాలకు వెళ్లాడు. అదే సమయంలో పిడుగు పడడంతో పొలాల్లోనే మృతి చెందాడు. సాయంత్రం అయినా కొడుకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు స్థానికులతో కలిసి గాలించారు. రాత్రి 10 గంట ప్రాంతంలో పంట పొలాల్లో మృతి చెంది ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం బుధవారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి

పుంగనూరు: మండలంలోని నెక్కుంది గ్రామంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం నిర్వహించారు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని నెక్కుందికి చెందిన నరేష్‌కు పెద్దపంజాణి మండలం పోలేపల్లెకు చెందిన త్రివేణి(26)తో సుమారు నాలుగు నెలల క్రితం వివాహమైంది. ఇలా ఉండగా భార్యాభర్తల మధ్య తీవ్ర కలహాలు రావడంతో గత వారం రోజులుగా కుటుంబ సభ్యులు పంచాయతీలు నిర్వహించారు. భర్త నరేష్ మంగళవారం ఇంటిలో లెటర్ రాసి, దూరంగా వెళ్లిపోతున్నట్లు స్నేహితులకు మెసెజ్ పెట్టడాన్ని త్రివేణి చూసి ఆందోళనకు గురైంది. ఉదయం గ్రామ సమీపంలోని వేపచెట్టుకు చున్నీతో ఉరివేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టంకు తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్‌గా బందీ



- అరచేతిలోనే ప్రపంచం
- జిల్లాలో పెరిగిన స్మార్ట్‌ఫోన్ల వినియోగం
- పదిలక్షలు దాటిన సెల్‌ఫోన్ యూజర్లు
- వీటి రీచార్జ్ కోసం నెలకు రూ.15 కోట్లు



పలమనేరు: శరీరానికి కాసేపు రక్తం అందకపోయినా, ముక్కుకు శ్వాస ఆడకపోయినా బతికేస్తారు కానీ నిమిషం పాటు సెల్ చేతిలో లేకుంటే బతకలేరు నేటి తరం. డ్రగ్స్‌కు బానిసైనట్టు స్మార్ట్‌ఫోన్‌లో జనం బందీలుగా మారారు. ఇప్పుడు పట్టణాలు, పల్లెలనే తేడా లేకుండా స్మార్ట్‌ఫోన్ల వాడకం ఎక్కువైంది. మొబైల్ లేకుంటే బుర్ర కూడా పనిచేయడం లేదు. మితిమీరిన సెల్ వాడకం మనిషి జీవితాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నా మార్పు రావడం లేదు. ఇప్పటికే చాలామంది వారికి తెలియకనే మానసిక రోగుల్లా మారారు. ఇంకొందరు అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు.

ఇదిగో సాక్ష్యం

పలమనేరు పట్టణంలో అద్దెగది తీసుకొని ఇంజినీరింగ్ విద్యార్థిని సెల్‌ఫోన్ అతిగా వాడొద్దని తల్లిదండ్రులు మందలించారు. దీంతో అప్పటికే మొబైల్‌కు బానిసైన ఆ విద్యార్థి తన గదిలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని పదో తరగతి చదివే బాలికకు మొబైల్ కొన్విలేదని తన చేతిని బ్లేడ్‌తో కోసుకొని ఆస్పత్రిపాలైంది. ఇలాంటి సంఘటనలు జిల్లాల్లో నిత్యకృత్యంగా మారాయి.

జిల్లాలో పది లక్షల స్మార్ట్ ఫోన్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1990లో కీ ప్యాడ్ ఫోన్ల వాడకం మొదలైంది. తొలుత తిరుపతి, చిత్తూరు, కుప్పం, మదనపల్లెలో రిలయన్స్ మొబైల్ టవర్ల ద్వారా నెట్‌వర్క్‌ను అందిస్తూ సేవలను మొదలు పెట్టారు. ఆపై పలు సెల్ కంపెనీలు మార్కెట్‌లోకి వచ్చాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 8వేల దాకా సెల్‌ఫోన్ టవర్లున్నాయి. ఉమ్మడి జిల్లా జనాభా 44 లక్షలు కాగా వీరిలో సెల్‌ఫోన్లు (కీప్యాడ్, టచ్ మొబైల్)వాడేవారి సంఖ్య ప్రస్తుతం 10 లక్షలకు చేరింది. గత నాలుగేళ్లుగా సెల్‌ఫోన్ల వాడకం ఏటా 15 శాతం పెరుగుతున్నట్టు ట్రాయ్ (టెలిఫోన్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) లెక్కలు చెబుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లను వాడేవారిలో రోజుకు సగటున యువత 4 గంటలు, విద్యార్థులు, 2 గంటలు, గృహిణిలు 2 గంటలు, అధికారులు 1.30 గంటలు, పిల్లలు గంటపాటు సమయాన్ని కేటాయిస్తున్నట్టు తెలిసింది.

రీచార్జ్ కోసం నెలకు పెట్టే ఖర్చు రూ.15 కోట్లు

జిల్లాలోని యూజర్లు నెలకు స్మార్ట్‌ఫోన్ల రీచార్జ్ కోసం నెలకు రూ.150 అనుకున్నా సుమారు రూ.15కోట్లు వివిధ ప్రొవైడర్లకు వెచ్చిస్తున్నారు. ఈ లెక్కన ఏటా సెల్‌ఫోన్ రీచార్జ్ కోసం ఖర్చు చేస్తున్న మొత్తం రూ.180 కోట్ల దాకా ఉంటుందని అంచనా. స్మార్ట్‌ఫోన్ వాడుతున్న వారిలో 80 శాతం మంది యూట్యూబ్ చూస్తుండగా, 60 శాతంమంది వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లను వాడుతున్నట్టు గూగుల్ చేసిన సర్వేలో తేలింది. యువతలో 50 శాతం మంది ఆన్‌లైన్‌లో గేమ్స్‌కోసం సమయాన్ని వెచ్చిస్తున్నారు. మహిళలు పనిపాట చేసుకుంటూ కూడా సీరియళ్లను మొబైల్‌లోనే చూసేవారి సంఖ్య పెరుగుతోంది. ఇక చిన్నపిల్లలు సైతం స్మార్ట్‌ఫోన్ చేతికివ్వకుంటే ఏడుపు మొదలు పెట్టడం చూస్తూనే ఉన్నాం. ఈ విధంగా సెల్ మనిషిని ఆవహించిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

స్మార్ట్‌గా సమయం వృథా

విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకంతో విలువైన సమయాన్ని వృథా చేసుకొని చదువుల్లో వెనుకబడడం, ఫెయిల్ కావడం జరుగుతోంది. ఇక ప్రైవేటు సెక్టార్లలో పనిచేసేవారు మొబైల్ కారణంగా పనులు పెండింగ్ పడుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు సెల్‌తోనే రోజంతా గడిపేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో ప్రభుత్వ సేవలు కుంటుపడుతున్నాయి. ముఖ్యంగా ఉత్పాదక రంగంలోనూ దీని ప్రభావం కనిపిస్తోంది.

రకరకాల సమస్యలు తప్పనట్టే

రాత్రిపూట నిద్రపోకుండా సెల్‌చూడడం కారణంగా నిద్రలేమి ప్రధాన సమస్యగా మారుతోంది. దీంతో మనిషి జ్ఞాపకశక్తి, ఏకాగ్రత దెబ్బతింటోందని(డబ్ల్యూహెచ్‌వో) ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో తెలిపింది. ఇలాంటి వారికి కొన్నాళ్ల తర్వాత నిద్రరాని పరిస్థితి ఏర్పడుతుంది. శరీరంలో మెలటోనియన్ నిల్వలు నశించి డిప్రెషన్‌లోకి వెళ్లే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా నిద్రలేమి కారణంగా అధికబరువు సమస్య ఎదురవుతోంది. చీకట్లో సెల్‌ఫోన్ చూడడంతో దాని నుంచే వచ్చే బ్లూ కిరణాలు రెటీనాను బలహీనం చేసి కార్ట్‌డాక్ సమస్యలు వస్తాయి. ఎక్కువగా స్మార్ట్‌ఫోన్ రాత్రిలో వాడే పిల్లలకు తలనొప్పి, చూపుమందగించి కంటి అద్దాలను వాడాల్సిందే. దీంతోపాటు మెడనొప్పులు వచ్చేఅవకాశం ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం



మితిమీరి సెల్‌ఫోన్ వాడకంతో కలిగే అనర్థాలపై కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఏదేని అవసరం ఉంటే తప్ప ఫోన్ వాడకం తగ్గించాలి. దీంతో ఆరోగ్యం కూడా బాగుంటుంది. ముఖ్యంగా కళాశాలలో సెల్‌ఫోన్లు వాడకుండా ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో పిల్లల పట్ల కాస్త కఠినంగా ఉండాలి. లేకుంటే బుజ్జగించి అయినా సరే ఫోన్ వాడకం తగ్గించేలా చూడాల్సిన అవసరం ఉంది.

– కృష్ణమూర్తి రెడ్డి, ప్రిన్సిపల్, పలమనేరు

స్మార్ట్‌తో ఎన్నో ఇబ్బందులు



పుట్టిన పిల్లలనుంచి పెద్దల దాకా ఇప్పుడు సెల్‌ఫోన్ ఓ లోకంలా మారిపోయింది. కొందరైతే కనీసం రెండు జీబీ ఖాళీ చేస్తేగానీ మనసు కుదుటపడదు. ముఖ్యంగా చిన్నపిల్లలు బడినుంచి ఇంటికి రాగానే చేతిలోని సెల్ ఉండాల్సిందే. విద్యార్థులకు సైతం స్మార్ట్‌ఫోన్ వ్యామోహం పెరిగింది. వీటిని ఎలా నియంత్రించాల్లో తల్లిదండ్రులకే అర్థంగాని పరిస్థితిగా మారింది. ఎక్కువగా సెల్ వాడకంతో మంచికంటే చెడ్డే ఎక్కువ అని గ్రహించాలి. జనంలో మార్పు రావాలి.

– సోమచంద్రారెడ్డి, మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షుడు

ఎన్నికల ఫలితాలపై అనుమానాలున్నాయ్



బియ్యపు మధుసూదన్‌రెడ్డితో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ అనూహ్య ఓటమి చెందడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి తెలిపారు. తాజా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ శ్రీకాళహస్తి అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డితో బుధవారం రాత్రి ఆయన భేటీ అయ్యారు. పార్టీ కార్యాలయానికి వచ్చి సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో అనూహ్య ఓటమి చోటు చేసుకోవడంపై చర్చించారు. ఐదేళ్లుగా జగనన్న పాలనలో లక్షలాదిమందికి లబ్ధి చేకూరిందని, తామంతా జగనన్న వెంటే అంటూ ప్రజలు ముక్తకంఠంతో తెలియజేయడంతో పాటు సభలకు వేలాదిగా తరలివచ్చారని తెలిపారు. అయితే ప్రజలు ఓట్లు ఎందుకు వేయలేదని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని చెప్పారు. మనోనిబ్బరం కోల్పోకుండా పార్టీ శ్రేణులకు, ప్రజలకు మరింత చేరువ కావాలని మధుసూదన్‌రెడ్డికి సూచించారు.

వ్యక్తిపై దాడి చేశారని ఫిర్యాదు

చిల్లకూరు: ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తిపై కొంతమంది వ్యక్తులు దాడి చేసిన ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని బూదనం గ్రామానికి చెందిన కొళ్లపూడి ప్రవీణ్, తండ్రి సుబ్బయ్య వారి ఇంటిలో మంగళవారం రాత్రి వాదులాడుకున్నారు. ఈ సమయంలో గ్రామానికి చెందిన కొంతమంది పేర్లు పెట్టి తిట్టినట్లు సమాచారం. దీంతో గ్రామానికి చెందిన కలిచేటి వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, శ్రీనివాసులు, జడ శ్రీనివాసులు, గోవిందు వెంకటేశ్వర్లు, రాజా తదితరులు బుధవారం ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తున్న ప్రవీణ్‌ను అడ్డుకుని రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపార

నీట్ ఫలితాల్లో విశ్వసాయి ప్రభంజనం



అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో చైర్మన్

నెల్లూరు(అర్బన్): నీట్ ఫలితాల్లో విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించి తమ ప్రతిభను చాటారని ఆ విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. బుధవారం కళాశాలలో కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టి ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ తమ కళాశాలలో 110 మందికి పైగా ఎంబీబీఎస్, బీడీఎస్‌లో చేరడానికి అర్హత సాధించారన్నారు. వారిలో దీక్షిత 658 మార్కులను, ప్రేమ్‌సాయి 636, యశ్వంత్‌కుమార్ 632, పూజిత 626, గురుచంద్రిక 625, సాయిశ్రియ 620, శ్లోకారెడ్డి 612, సత్యకార్తికేయ 600 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ రుక్మిణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిపై కత్తులతో దాడి

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శిపై హత్యాయత్నం
- ఐతేపల్లి వద్ద వార్డు సభ్యుడి దాబా ధ్వంసం
- చంద్రగిరి పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్తత



టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన దాబా



గాయపడిన వార్డు సభ్యుడు వంశీ, సాధిక్

చంద్రగిరి: తెలుగుదేశం పార్టీ గెలుపొందడంతో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. బుధవారం చంద్రగిరిలో బీభత్సం సృష్టించారు. వివరాలు ఇలా.. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి, పార్టీ మండల కన్వీనర్ మస్తాన్ బుధవారం రాత్రి ఇంటి వద్ద నుంచి వస్తున్న క్రమంలో టీడీపీకి చెందిన చంద్రశేఖర్, ప్రసాద్, కుమార్, రాజు, లోకేష్‌తో పాటు మరికొంతమంది అడ్డగించారు. ఒక్కసారిగా మస్తాన్‌పై దాడికి పాల్పడి విచక్షణా రహితంగా కొట్టారు. ఇంతలో విషయం తెలుసుకున్న బంధువులు అక్కడకు చేరుకుని దాడిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో మస్తాన్‌పై టీడీపీ వారు కత్తితో దాడికి యత్నిస్తుండగా అడ్డుకున్న సాధిక్ అనే యువకుడి చేతికి గాయాలయ్యాయి. మహిళలను సైతం ఇళ్ల వద్దకు వెళ్లి బెదిరించారు. దీంతో తమకు రక్షణ కల్పించాలంటూ పోలీసులను కోరారు. సమాచారం అందుకున్న పార్టీ నాయకులు పెద్దఎత్తున పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం మస్తాన్ పార్టీ నాయకులతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన కొంతమంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దాబా ధ్వంసం..

మండల పరిధిలోని ఐతేపల్లి వద్ద ఉన్న దాబాను టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. బుధవారం మద్యం సేవించిన టీడీపీ కార్యకర్తలు దాబా వద్దకు వెళ్లి గొడవకు దిగారు. సమాచారం అందుకున్న వార్డు సభ్యుడు సక్కూరు వంశీ దాబాకు వద్ద వెళ్లాడు. ఇంతలో అక్కడికి పోలీసులు సైతం చేరుకున్నారు. అయితే మాపైనే పోలీసులకు చెప్తావా అంటూ వార్డు సభ్యున్ని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. అనంతరం దాబాలోని కుర్చీలు, టేబుళ్లను ధ్వంసం చేశారు. తీవ్రంగా గాయపడిన వంశీని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం



మొక్కలు నాటుతున్న ఎస్వీ జూలాజికల్ పార్కు క్యూరేటర్ సెల్వం, శ్రీనివాస నెహ్రూ

తిరుపతి(అలిపిరి): మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని.. ప్రతిఒక్కరూ మొక్కలను పెంచడం అలవాటుగా చేసుకోవాలని ఎస్వీ జూలాజికల్ పార్కు క్యూరేటర్ సి.సెల్వం అన్నారు. ప్రాంతీయ విజ్ఞానకేంద్రం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో గత నెల 31 నుంచి జూన్ 5 వరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఎన్విరాన్‌మెంట్ క్విజ్, పెయింటింగ్, వ్యాసరచన వంటి పలు పోటీలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. బుధవారం ప్రాంతీయ విజ్ఞానకేంద్రం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయ ఆవరణల్లో మొక్కలు నాటారు. సీనియర్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్లు నరేంద్రబాబు, అశోక్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణాన్ని మరింత నిలకడగా మార్చడానికి, వనరులను సంరక్షించడానికి జీవనశైలిలో మార్పులు చేసుకోవడంపై వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సందర్శకులకు పర్యావరణ హిత బ్యాగులను పంపిణీ చేశారు. ఎస్వీయూ ఎన్విరాన్‌మెంట్ సైన్సెస్ విభాగం హెచ్ ఓడీ ప్రొ.టి.దామోదరం, సైన్స్ సెంటర్ కోఆర్డినేట ర్ శ్రీనివాస నెహ్రూ, పురుషోత్తం పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తిరుపతి అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ఇంజినీర్ నరేంద్రబాబు తెలిపారు. జూపార్క్‌లో బుధవారం పర్యావరణ అవగాహన ముగింపు వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన పర్యావరణ రక్షణకు చెందిన బ్యాగ్‌లను ఆవిష్కరించారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, తిరుపతి వారి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రీజనల్ సైన్స్ సెంటర్, తిరుపతి వారి సహకారంతో పర్యావరణ అవగాహన వారోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు చెప్పా రు. కార్యక్రమంలో జూపార్కు క్యూరేటర్ సి.సెల్వం, ప్రొఫెసర్ డి.దామోదరం, కె.శ్రీనివాస నెహ్రూ, అశోక్ కుమార్, ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, పద్మనాభం, ప్రొఫెసర్ దామోదరం పాల్గొన్నారు.

12 నుంచి ప్రపంచ పర్యావరణ దినోత్సవం

– డీఈఓ శేఖర్



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఈఓ డాక్టర్ శేఖర్

చంద్రగిరి(తిరుచానూరు): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం తిరుచానూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా రాష్ట్రప్రభుత్వం ఈ నెల 12 నుంచి 19 వరకు ఆరు రోజుల పాటు పాఠశాల స్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. 12న సేవ్ వాటర్, 13న సేవ్ ఎనర్జీ, 14న రెడ్యూస్ వేస్టేజ్, 15న రెడ్యూస్ ఈ వేస్ట్, 18న సైనబుల్ ఫుడ్ సిస్టం, 19వ తేదీన హెల్తీ లైఫ్ స్టైల్ కార్యక్రమాలను పాఠశాల స్థాయిలో నిర్వ హిస్తామని తెలిపారు. అనంతరం ప్రపంచ పర్యావరణ సంబంధిత పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆయన మెమెంటోలను అందజేశారు. అంతకముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎంఓ శివశంకరయ్య, సీఎంఓ సురేష్, ఐఈ కోఆర్డినేటర్ డి.చంద్రశేఖర్ రెడ్డి, ఏఎస్ఓ ధనుంజయ సారథి, ఏసీఎంఓ డాక్టర్ రాము, ఏపీఓ గోపాలకృష్ణ, రుక్మాంగద, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ధ్వంసం



మురళీయాదవ్‌ను విచారిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: నగరంలోని ఎస్కే ఫాస్ట్‌ఫుడ్ సమీపంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూటమి మూకలు ధ్వంసం చేశాయి. ఎనిమిదో డివిజన్ పరిధిలో ఉన్న కార్యాలయాన్ని మురళి నిర్వహిస్తున్నారు. షట్టర్ ఓపెన్ చేసి గ్లాస్ డోరుకు తాళం వేసుకుని వెళ్లిన సమయంలో కూటమి నాయకులు రాళ్లతో దాడి చేసి లోపలికి దూరి ఫర్నీచర్ మొత్తం ధ్వంసం చేశారు. ఇందులో టీవీలు, కంప్యూటర్లు, బల్లలు అన్ని విరిగిపోయాయి. కావాలనే ఇలాంటి దాడులకు తెగబడినట్లు తెలుస్తుంది. కూటమి మూకలంతా కూడా నిత్యం కార్యాలయం సమీపంలోని ఓ చికెన్ షాపు మూసేసిన సమయంలో గంజాయి తాగేవారిని తెలిసింది. అయితే పోలీసులు గుర్తించి ఎలక్షన్ టైంలో వీరిని తరిమి కొట్టడంతో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వారే పోలీసులకు సమాచారం ఇచ్చారని వారే భావించి దాడులకు తెగబడినట్లుగా తెలుస్తోంది. అయితే ఆ సమయంలో కార్యకర్తలు ఎవరూ లేకపోవడం గమనార్హం. వారి వద్ద క్రికెట్ బ్యాట్లు కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. గెలిచి ఒకరోజు కూడా కాకముందే వీరు రౌడీయిజం చేయడంతో ఐదేళ్లు ఎలా భరించాలని ప్రజలు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కార్యాలయ నిర్వాహకులతో ఫిర్యాదు తీసుకున్నారు.